క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న కృష్ణ

ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామ నూతన కార్యవర్గాన్ని సమితి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, ప్రచార కార్యదర్శిగా జగదీష్, కార్యదర్శులుగా బాలస్వామి, మల్లికార్జున్, మహేందర్, ఆంజనేయులు, రాజు, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, మహేందర్, లింగం, అభిలాష్, ఉదయ్, శాంతయ్య, జంగయ్య, వెంకటయ్యలను నియమించారు. అనంతరం నియామక పత్రం అందజేశారు.

తిరుపతిరెడ్డికి నాయకుల స్వాగతం



తిరుపతిరెడ్డితో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్చార్జి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని బుధవారం పార్టీ ఆమనగల్లు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. కల్వకుర్తిలో జరిగే కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో తిరుపతిరెడ్డిని చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్యలు ఉన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



ఆలయంలో కొలువైన ఉత్సమూర్తులు

యాచారం: ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు సొంత నిధులు, ఇతరుల సహకారంతో రూ.కోటి న్నరకు పైగా వెచ్చించి మండల కేంద్రంలో నిర్మించిన ఆలయంలో బుధవారం శ్రీ సీతాస మేత శ్రీరామచంద్రాస్వామి, లక్ష్మణ, ఆంజనేయ, నర్మద శివలింగ, శిఖర, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఆంజనేయులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతను యాచారం గ్రామస్తులు, భక్తులు అభినందించారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

కడ్తాల్: విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధి రావిచేడ్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.12 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. చిన్నారుల విద్యాభివృద్ధికి తొలి మెట్టు అయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. భవన నిర్మాణం పూర్తయి.. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే సంక్షేమం



హోలీ వేడుకల్లో మహిళలు, నాయకులు

కడ్తాల్: కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ వేడుకల్లో మహిళలు పాల్గొని, కేసీఆర్‌పై తమకున్న అభిమానం చాటడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు సురేశ్, శివ పాల్గొన్నారు.

డబుల్.. గుబుల్!

- నిర్మాణం పూర్తయినా కేటాయించని వైనం
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న అర్హులు

డబుల్ బెడ్ రూం ఇళ్ల అర్హుల్లో గుబులు మొదలైంది. దరఖాస్తు చేసుకున్న సుదీర్ఘకాలం అనంతరం నిరు పేదలను గుర్తించినప్పటికీ.. సర్కారు మారడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని పలువురు వాపోతున్నారు. అసలు ఇళ్లు ఇస్తారా లేదా అని సందేహం వ్యక్తంచేస్తున్నారు.



లింగంపల్లి గేట్ వద్ద డబుల్ బెడ్ రూం ఇళ్లు

మంచాల: రెండు పడక గదులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మండల పరిధిలో ఎవరికీ ఇచ్చిన దాఖలాలు లేవు. కానీ.. ఆ ప్రభుత్వ హయాంలోనే ఆరేళ్ల క్రితం మంచాల మండల పరిధి నోముల రెవెన్యూ పరిధి 100,101 సర్వే నంబర్లలో 2 ఎకరాల స్థలం కేటాయించింది. అందులో 96 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. కేవలం మంచాల, లింగంపల్లి, నోములకు చెందిన నిరుపేదలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ క్రమంలో నోముల నుంచి 85, మంచాల నుంచి 276, లింగంపల్లి నుంచి 96 చొప్పున మొత్తం 460 దరఖాస్తులు రావడంతో అర్హుల ఎంపిక కష్టతరంగా మారింది.

గ్రామానికి 30 చొప్పున

అధికారులు, ప్రజా ప్రతినిధులు తర్జనభర్జన మధ్య గ్రామానికి 30 ఇళ్ల చొప్పున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను తయారు చేసి, లాటరీ పద్ధతిలో అర్హులను ఎంపిక చేశారు. మరో ఐదు ఇళ్లను రోడ్డు ప్రమాదంలో చనిపోయిన చెన్నారెడ్డి గూడ గ్రామస్తులకు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన రైతుకు ఒక ఇల్లు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో అర్హులైన వారు సంబురాలు చేసుకున్నారు. కానీ.. ఈ లోపే ప్రభుత్వం మారడంతో వారి ఆశ నిరాశే అయింది.

'ఇందిరమ్మ' అర్హుల ఎంపిక

కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ సర్కార్.. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో భాగంగా లింగంపల్లి గ్రామంలో అర్హులను ఎంపిక చేయగా.. ఇళ్ల నిర్మాణ పనుల కోసం వారు ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా.. మా పరిస్థితి ఏంటని డబుల్ బెడ్‌రూం ఇళ్ల అర్హులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయని, ఇంకా నిర్లక్ష్యం చేస్తే అవి శిథిలావస్థకు చేరతాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి, డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు కేటాయించి, న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎంపిక ప్రకారం



మాకు లింగంపల్లి గేట్ వద్ద డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఏడాది దాటింది. కానీ ఇవ్వలేదు. 20 రోజుల క్రితం మండల కార్యాలయం వద్ద ధర్నా చేశాము. ఎంపిక ప్రకారం అర్హులకు తక్షణమే ఇళ్లు కేటాయించాలి.

– పల్నాటి శకుంతల, నోముల

న్యాయం చేయాలి



డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో అధికారులు, ప్రభుత్వం పారదర్శకరంగా వ్యవహరించాలి. గతంలో గుర్తించిన విధంగా నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలి. సొంతింటి కల నెరవేర్చాలి.

– మంగళారం మంజుల, నోముల

అర్హులకే ఇస్తాం



లింగంపల్లి గేట్ వద్ద నిర్మించిన రెండు పడక గదులను కచ్చితంగా ప్రభుత్వం పేదలకు ఇస్తుంది. ఇంకా విద్యుత్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం కేటాయిస్తాం.

– ఎం.వీ.ప్రసాద్, తహసీల్దార్, మంచాల

చట్టబద్ధత తరువాతే.. ఉద్యోగాలివ్వాలి

ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్



ఇబ్రహీంపట్నం: దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం/ ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు సి.శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు సురేందర్ డిమాండ్ చేశారు. సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ చట్టబద్ధత అనంతరం గ్రూప్–1,2,3, హాస్టల్ వెల్ఫేర్ తదితర ప్రభుత్వ శాఖల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడే మాదిగలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. దీక్షలో సంఘం మండల అధ్యక్షుడు జె.సతీష్, కార్యదర్శి పి.నరేందర్, ఎస్.లక్ష్మయ్య తదతరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం.. వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం చేస్తూ, మాదిగలను మోసం చేస్తుందని ఆరోపించారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేవరకు ఉద్యోగ నియామకాలు, ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సమితి ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకుంది. దీక్షలో సమితి నాయకులు అనిల్, శ్రీశైలం, శేఖర్, మహేశ్, జగదీశ్, బాలస్వామి తదితరులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సంజీవ, మహేందర్, నరేశ్, శివుడు, ఆంజనేయులు, శ్రీను, శ్రీకాంత్, కుమార్, మహేశ్, శ్రీనివాస్, సురేశ్, శశికాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అండగా ఉంటాం**

తుర్కయంజాల్: జర్నలిస్టు శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ప్రముఖ దినపత్రిక విలేకరి సూరేపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఆయన బుధవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.

◆ **పకడ్బందీగా పది పరీక్షలకు ఏర్పాట్లు**

మాడ్గుల: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ సర్దార్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 21 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఎగ్జామ్ సెంటర్లలో మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

◆ **మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు**

ఇబ్రహీంపట్నం: చేసిన అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ మాజీ సర్పంచ్‌లు.. బుధవారం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ముందస్తుగా వారిని అరెస్టు చేసి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బల్వంత్‌రెడ్డి, యాదగిరి ఉన్నారు.

◆ **సాంస్కృతిక విభాగంలో బలరాం ప్రతిభ**

ఇబ్రహీంపట్నం: ఒడిశా బరంపూర్ యూనివర్సిటీ వేదికగా ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్.. సాంస్కృతిక విభాగంలో నేనావత్ బలరాం చక్కని ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి పొందాడు. కళాశాల నుంచి ఆరుగురు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం ఈ క్యాంపునకు వెళ్లారు. తెలంగాణ సంస్కృతి, బోనాలు, బతుకమ్మ ఆటపాట, పోతురాజు విన్యాసాలను ప్రదర్శించారు. ఈ విభాగంలో బలరాం బహుమతి సాధించాడు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రమేష్, రాకేష్ భవాని, రచన బలరాంను అభినందించారు.

◆ **ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు**

యాచారం: పాఠశాల విద్య భవితకు మార్గమని, కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధి కుర్మిద్ద ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఉన్నత లక్ష్యంతో చదివితే భవిష్యత్తు అంతా బంగారుమయమని సూచించారు. చేడు వ్యవసనాలకు లోను కావద్దని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఎస్ఐ తేజంరెడ్డి, హెచ్‌ఎం పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

◆ **ఆలయ అభివృద్ధికి కృషి**

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి గొరెల్లి గ్రామం శ్రీ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలిపారు. స్థిరాస్తి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆలయ ముఖద్వార నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. మాజీ ఎంపీటీసీ బాలలింగస్వామి, మాజీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, ఆలయ అర్చకుడు నవీన్ కుమార్, చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు దివ్యదాసు, రాజు పాల్గొన్నారు.

◆ **కోలాహలంగా ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీలు**

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని నాలుగో రోజు బుధవారం సాయంత్రం ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 16 ట్రాక్టర్లు పాల్గొనగా, వర్కాల వెంకటేశ్ ప్రథమ స్థానంలో నిలవగా.. ద్వితీయ స్థానంలో శేరి నవీన్, తృతీయ స్థానంలో గజ్జెల అశోక్ నిలిచారు. అనంతరం ప్రథమ విజేతకు.. నాయకుడు చేగూరి రవికుమార్ రూ.6,116 అందజేయగా.. ద్వితీయ విజేతకు మిర్యాల యాదయ్య రూ.5,116లను అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన వారికి కల్లూరి మల్లేశ్ రూ.3,116లు బహూకరించారు. సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

◆ **స్వపరిపాలన దినోత్సవం**



ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చెన్నారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి వారికి పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడిగా శివప్రసాద్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ చంప్లనాయక్ బహుమతులు అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రామనాథం, సీఆర్పీ ప్రవీణ్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యాయుడు జగయ్య, హెచ్‌ఎం అంజయ్యనాయక్ , ఉపాధ్యాయురాలు లక్ష్మీబాయి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మంచాల: మండల పరిధి జాపాల గ్రామంలో గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అపరిశుభ్రత కారణంగా వచ్చే అనారోగ్య సమస్యల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమ్లా నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుధారాణి, కో–ఆర్డినేటర్లు జగన్, అరుణ్ తేజేందర్‌రెడ్డి, రంజిత, భారతి, ప్రవీణ్ బాలు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



యూత్ భవన నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఎమ్మెల్యే నిధులు రూ.5 లక్షలతో మహరాజ్ యూత్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనతో పాటు దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకు నర్సింహ, కృష్ణ, బుగ్గరాములు, లక్ష్మణ్, బాష, చంద్రయ్య, రమేష్, మార సురేష్, వస్పరి కుమార్, మల్లేశ్, శ్రీకాంత్, రాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బుధవారం సాయంత్రం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. శివ జట్టుకు చేగూరి రాజు రూ.5116తో పాటు షీల్డ్ అందజేయగా.. ద్వితీయ స్థానంలో నిలిచిన జైం భీం టీంనకు క్యాసగళ్ల రమేశ్ రూ.4116, జ్ఞాపిక ప్రదానం చేశారు. అదే విధంగా టోర్నీకి ఆర్థిక సాయం చేసిన విక్రాంత్, మారెళ్ల చందు, డాక్టర్ శ్రీనులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్లు ప్రశాంత్, రవికుమార్, వంశీ, రవికుమార్, నరేశ్, చింటూ, పవన్, సాయి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గ పరిధి పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను నగరంలోని ఆయన నివాసంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గానికి యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇదిలా ఉండగా.. కల్వకుర్తి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడంతో.. పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్, గ్యార నర్సింహ, కిషన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి దేవాలయం



ఉత్సవమూర్తులు

- 17న వేంకటేశ్వరస్వామి కల్యాణం
- 20న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ఆమనగల్లు: బ్రహ్మోత్సవాలకు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో వెలసిన దేవాలయంలో ఈ నెల 13 నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఏకశిలలో శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడవాహనంపై వెలసిన అత్యంత పురాతన ఆలయం ఇది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేటి నుంచి 8 రోజులు

13న స్వామివారికి అభిషేకం, రుత్వికరణ, స్వస్తి వాచనం, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14న ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానహోమం, బలిహరణం, సింహ వాహనసేవ. 15న పారాయణం, హోమం, హంస వాహన సేవ, హనుమత్ వాహన సేవ. 16న హోమం, మోహినీ సేవ, గరుడ సేవ, ఎదుర్కోలు. 17న శ్రీ స్వామివారి కల్యాణం, సాయంత్రం గజ వాహన సేవ. 18న స్వామివారి నిజరూపదర్శనం, మహాభిషేకం, రాత్రికి రథోత్సవం. 19న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రభలు తిప్పుట, లంకాదహనం. 20న పుష్పయాగం, శేష వాహనసేవ, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకోవాలని ధర్మకర్త రాజ్‌కుమార్, ఈఓ స్నేహలత, అర్చకులు గోపాలాచార్యులు, రామాచార్యులు, మాజీసర్పంచ్ శ్రీశైలం కోరారు.

బండలాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా 20న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ శ్రీశైలం తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.1.20 లక్షల నగదు, రెండో బహుమతిగా రూ.90 వేలు, తృతీయ బహుమతిగా రూ.80 వేలు, నాలుగో బహుమతిగా రూ.70 వేలు, ఐదో స్థానంలో నిలిచిన వారికి రూ.60 వేల చొప్పున మొత్తం పది బహుమతులు ప్రదానం చేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

ఊరించడమే కాని.. ఇచ్చేది లేదు



సర్వే చేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఊరించడమే తప్ప.. ఎప్పుడిస్తామో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేక పోతుందని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలమయిందన్నారు. మండల పరిధి దండుమైలారం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా, మిగతా హామీల్లో ఏ ఒక్కటీ సరిగా అమలు కావడం లేదన్నారు. ఉచిత కరెంట్ పూర్తిగా అమలు కావడం లేదని, వంట గ్యాస్ సబ్సిడీ అందరికీ అందడం లేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఉపాధిహామీకి లింకు పెట్టడం సరైంది కాదన్నారు. 2007లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దండుమైలారానికి చెందిన 70 మంది పేదలకు ఇంటి స్థలం పట్టాలు ఇచ్చినా.. నేటికీ ఆ స్థలాలను చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే రేవంత్ సర్కార్‌పై ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు కాకి రమేష్, లింగస్వామి ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీటి కటకట



విద్యార్థులకు వాటర్ టిన్నులు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదర్శ పాఠశాలలో తాగు నీటి కష్టాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్వీ, యువజన విభాగం నాయకులు ఆరోపించారు. బుధవారం బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలను నాయకులు సందర్శించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి, ఎంకేఆర్ ఫౌండేషన్ సహకారంతో నాలుగు వాటర్ టిన్నులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో పాఠశాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి రోజు తాగునీరు అందిస్తామని మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం ఆదిబట్ల అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు రాజు, శివసాయి, యువజన విభాగం నియోజకవర్గం ప్రచార కార్యదర్శి గణేశ్, ప్రసాద్‌గౌడ్, కరుణాకర్, జలందర్, సురేష్, శివయాదవ్, నిఖిల్, అరుణ్‌గౌడ్, సంపత్, రామ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి, పరిష్కార మార్గం చూపాలని కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ జిల్లా నాయకుడు పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాల గురించి అసెంబ్లీలో చర్చకు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు నవనీత, స్వరూప, మంజుల, మంగమ్మ, అనిత, రాధ, బాలమణి, అనసూయలు పాల్గొన్నారు.